# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## యూరప్ దారి ఎటు?

**యురోపియన్** యూనియన్ (ఈయూ) అనేది జాతీయవాదానికి అతీతమైన కూటమి. 27 యూరప్ దేశాలు అందులో సభ్యులుగా ఉన్నాయి. ఈ 27 దేశాలకు చెందిన ప్రజలు ఈయూ పార్లమెంటు సభ్యులను నేరుగా ఎన్నుకుంటారు. ఐదేండ్లకోసారి జరిగే ఈ ఎన్నికల పోలింగ్ ఈనెల 3-9 తేదీల్లో జరిగింది. ప్రత్యక్ష ప్రజామోద ముద్ర కారణంగా ఈయూను ప్రభుత్వాలకు అతీతమైన సూపర్ ప్రభుత్వంగా భావిస్తుంటారు. ఆయా సభ్యదేశాల సార్వభౌమత్వం ఈయూకు లోబడి ఉంటుంది. భద్రత, వాణిజ్య తదితర కీలక రంగాలకు సంబంధించిన విధానాలు ఈయూ పరిధిలోనే ఉంటాయి. తన సార్వభౌమత్వంపై ఈ తరహా ఆధిపత్యం ఏ మాత్రం అంగీకరించని బ్రిటన్ ఈయూ నుంచి వైదొలగిన సంగతి తెలిసిందే.

ఉక్రెయిన్ యుద్ధం, గాజా నుంచి కాందిశీకుల వెల్లువ, వాతావరణ మార్పుల సంక్షోభం నేపథ్యంలో ఈయూ ఎన్నికల ఫలితాలపై సహజంగానే ఆసక్తి కొంచెం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఈయూ ఎన్నికల్లో జాతి ఆధిపత్య వాదుల ప్రాబల్యం పెరిగినట్టు వస్తున్న వార్తలపై ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇదంతా దేనికి సంకేతమనే విశ్లేషణలు జోరుగా జరుగుతున్నాయి. మరోవైపు పర్యావరణ పరిరక్షణకు పాటుపడే గ్రీన్స్ పార్టీ, సామాజిక న్యాయం కోసం పోరాడే వామపక్ష పార్టీల బలం ఈయూలో క్రమంగా తగ్గుతున్నది. ఉదారవాదులను ఈ పరిణామాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. యూరప్ ఓటర్లు తమ తమ జాతీయపార్టీల అభ్యర్థుల నుంచి ఈయూ ఎంపీలను ఎన్నుకుంటారు. అలా ఎన్నికైన సభ్యులు భావజాలాన్ని బట్టి ఈయూ స్థాయిలో కూటములు కడతారు. ఇటలీ, ఫిన్లాండ్ హంగరీల్లో ఈ సరికే జాతి ఆధిపత్యవాద పార్టీలు అధికారంలో ఉన్నాయి. ఇప్పుడు ఈయూ ఎన్నికల్లో అదే ప్రతిఫలిస్తున్నది. జర్మనీ, ఫ్రాన్స్, ఆస్ట్రియా దేశాల్లో పాలక పక్షాలకు ఎదురుదెబ్బ తగిలింది. ఫ్రాన్స్‌లో పాలక రినైజాన్స్ పార్టీ జాతి ఆధిపత్య వాద నేషనల్ ర్యాలీ పార్టీ చేతుల్లో చిత్తు కావడం ప్రకంపనలకు దారితీసింది. దీంతో అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ పార్లమెంటును రద్దుచేసి ఎన్నికలకు ఆదేశించడం చిన్న విషయం కాదు.

జాతి ఆధిపత్యవాదం ఫలితంగా యూరప్ రెండు ప్రపంచయుద్ధాలను చూసింది. అపారమైన ధన, ప్రాణ నష్టాలకు గురైంది. యూరప్ ప్రజలకు ఈ మహమ్మారి అంటే సహజంగానే వ్యతిరేకత ఉంటుంది. అయినప్పటికీ దేశదేశాల్లో జాతి ఆధిపత్యవాదం పడగ విప్పుతూనే ఉంది. నయా ఫాసిస్టు మూకలు జర్మనీ వంటి దేశాల్లో తూర్పు నుంచి వలస వచ్చిన ప్రజలపై దాడుల చేయడం గురించిన వార్తలు తరచూ వెల్లువడుతూనే ఉన్నాయి. ఇది జర్మనీకి మాత్రమే పరిమితమైన విషయం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఇస్లామిక్ తీవ్రవాదం పెచ్చరిల్లిన తర్వాత యూరప్‌లో జాతిపరమైన వివక్షలు పెరిగిపోయాయి. వలస విముక్త దేశాల నుంచి వచ్చిన ప్రజలను అనుమానంగా చూడటం పెరిగిపోయింది. ఈ పరిస్థితులు ఆయా దేశాల్లో ఉద్రిక్తతలు పెరగడానికి దారితీశాయి. ఈ నేపథ్యంలో ఆసియా నుంచి బతుకుదెరువు కోసం వెళ్లి యూరప్ దేశాల్లో స్థిరపడిన భారతీయులకు, ఇతర మాజీ వలస దేశాలవారికి ఈయూలో జాతి ఆధిపత్యవాదుల పట్టు పెరుగుతుండటం సహజంగానే ఆందోళన కలిగిస్తున్నది. అయితే జాతి ఆధిపత్యవాదుల బలం గణనీయంగా పెరిగినప్పటికీ అదింకా నిర్ణాయక స్థాయికి చేరుకోకపోవడం కొంత ఉపశమనం కలిగించే విషయం.

# మోదీ 3.0: రాష్ట్రాలకు గౌరవం దక్కేనా?

**మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జరిగిన ఓ ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ మోదీ వద్దకు రాగానే ఆయన లేచి నిలబడి కరచాలనం చేశారు. పక్కనే ఉన్న అమిత్ షా, నడ్డా కూర్చున్నప్పటికీ మోదీ మాత్రం గౌరవపూర్వకంగా లేచి కరచాలనం చేశారు. ఈ సన్నివేశాన్ని చూశాక నాకు సరిగ్గా పదేండ్ల కిందట ఢిల్లీలో జరిగిన ఒక ఘటన గుర్తుకువచ్చింది. ఒక సమావేశంలో ముఖ్యమంత్రులందరూ వరుసగా నిలబడగా.. తొలిసారి ప్రధాని బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ వారికి కరచాలనం చేస్తూ ముందుకు వెళ్తున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కరచాలనం చేసేందుకు చేయి ముందుకుచాస్తే.. మోదీ ఆయనను పట్టించుకోకుండానే వెళ్లిపోయారు. అప్పట్లో ఆ ఘటన సంచలనంగా మారింది.**



బుద్దా మురళి

దేశమంతా బీజేపీ విజయకేతనం ఎగురవేస్తే దేశ రాజధానిలో మాత్రం ఆప్ గెలవడం మోదీకి కంటగింపుగా ఉండటం సహజమే. కానీ, ప్రధానిగా ఆయన హుందాగా ఉండాలి. పార్టీలతో సంబంధం లేకుండా అందర్నీ గౌరవించాలి. మోదీ పదేండ్ల పాలనలో ఆ గౌరవ ప్రవర్తన చూసే భాగ్యం మనకు దక్కలేదు. మోదీ పగ ఏ స్థాయిలో ఉంటుందో కేజ్రీవాల్ జైలులో ఉండటాన్ని చూస్తేనే అర్థమవుతున్నది. చివరికి ఏదో మాట తూలాడని రాహుల్ గాంధీ పార్లమెం ట్ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయించారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారాయి. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి సీట్లు తగ్గడంతో మిత్రపక్షాలకు ఆదరణ పెరిగింది. నితీష్ కుమార్‌కు ఎన్డీయే ద్వారా లు మూసుకుపోయాయని ప్రకటించిన మోదీనే ఆయన కనిపించగానే అప్రయత్నంగా లేచి నిలబడి స్వాగతం పలకడమే అందుకు నిదర్శనం.

అలా అని మోదీ ఇక పూర్తిగా మారిపోయారు, ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తారని ఒక నిర్ణయానికి రాలేం. చంద్రబాబు, నితీష్‌ల మద్దతు వల్ల మోదీ తిరిగి అధికారంలోకి వచ్చారు. అది మద్దతుకు లభించిన గౌరవమే తప్ప ప్రజాస్వామ్యంలో అందరినీ సమానంగా గౌరవించాలనే హుందాతనం అని భావించలేం. రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేయడం, ప్రత్యర్థి పార్టీల నాయకులపై సీబీఐ, ఈడీ దాడులు చేయించడం, వారిని జైలుపాలు చేయడం వంటి మోదీ మార్క్ కక్ష సాధింపు రాజకీయాలకు మాత్రం బ్రేక్ పడుతుందని ఆశించవచ్చు.

ఈ సందర్భంగా ఓషో చెప్పిన ఓ కథ గుర్తుకువస్తున్నది. ఒక సంపన్నుడు మితిమీరిన కోపం తో భార్య తల నరికేస్తాడు. ఆ తర్వాత బాధ పడుతూ సన్యాసి వద్దకు వెళ్తాడు. తనకు సన్యాసం ఇప్పించాలని కోరుతాడు. 'నువ్వు సంపన్నుడివి, నీది విలాసవంతమైన జీవితం. ఖరీదైన దుస్తులు ధరిస్తావు. సన్యాసం నీ వల్ల కాదు' అని సన్యాసి చెప్తుండగానే ఆ సంపన్నుడు తన దుస్తులను ఫరాఫరా చింపేస్తాడు. ఇప్పుడు సన్యాసం ఇవ్వండని కోరతాడు. అందుకు సన్యాసి నవ్వి.. 'నీలో ఎలాంటి మార్పు రాలేదు. భార్య తల నరికినప్పుడు ఎలాగైతే ఆవేశంతో ఉన్నావో, ఇప్పుడు బట్టలు చింపుకొన్నప్పుడు కూడా అంతే ఆవేశంగా ఉన్నావు' అని చెప్పి పంపించేస్తాడు.

ఇప్పుడు మోదీ విషయానికి వస్తే.. గతంలో ఒక సీఎంతో కరచాలనం చేయకుండా అవమానించడం, ఇప్పుడు ఒక సీఎం రాగానే లేచి నిలబడి కరచాలనం చేసిన తీరు రెండింటిలోనూ సహజ లక్షణం లేదు. బీజేపీకి సొంతంగా బలం ఉన్నప్పుడు అన్నీ నడిచిపోయాయి. ఇప్పుడు ఆ పార్టీ 240 సీట్లకే పరిమితమైంది. నితీష్, చంద్రబాబుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వల్ల గతంలో మాదిరిగా తన ఇష్టానుసారం వ్యవహరించడం సాధ్యం కాదు. బీజేపీ సొంత బలంతో తిరిగి అధికారంలోకి వస్తే రాజ్యాంగం ఉండదు, రిజర్వేషన్లు ఉండవని చాలామంది భయాందోళనకు గురయ్యారు. 240 సీట్లకు పరిమితం కావడం వల్ల ఈ భయాలు ప్రస్తుతానికి తొలిగిపోయినట్టే.

**బీబీసీ చర్చలో విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ ఆసక్తికరమైన విషయాలను ప్రస్తావించారు. దక్షిణాదిలో దక్కిన సీట్ల వల్ల మోదీ ఈసారి అధికారంలోకి వచ్చారని చెప్తూనే.. దక్షిణాది కారణంగా అధికారంలోకి రావడం వల్ల మంచే జరిగిందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది సీట్లను తగ్గించి ఉత్తరాది సీట్లను పెంచాలనేది బీజేపీ వ్యూహం. ఇప్పుడు చివరికి దక్షిణాదియే బీజేపీని గట్టెక్కించడం వల్ల పార్లమెంటు నియోజకవర్గాల తగ్గింపు గండం దక్షిణాదికి తప్పినట్టయింది.**

సంకీర్ణ ప్రభుత్వమే అయినా మోదీ తన పంథాను మార్చుకోవడం లేదు. పేరుకు సంకీర్ణ ప్రభుత్వమే అయినప్పటికీ గతంలో బీజేపీకి సొంతంగా బలం ఉన్నప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారో అలాంటి నిర్ణయాలే ఆయన తీసుకున్నారు. సంకీర్ణ ప్రభుత్వంలో మంత్రివర్గంలో శాఖల కోసం మిత్రుల నుంచి తీవ్రంగా ఒత్తిడి ఉంటుంది. మంత్రివర్గం ఎలా ఉంటుందోనని స్టాక్‌మార్కెట్ అనేక సందేహాలతో కొట్టుమిట్టాడింది. గతంలో మాదిరిగానే మంత్రివర్గంలో కీలక శాఖలన్నీ బీజేపీనే తీసుకోవడంతో స్టాక్‌మార్కెట్ ఊపిరి తీసుకొని దూసుకెళ్తున్నది. చంద్రబాబు, నితీష్ కుమార్‌ల మద్దతు మోదీకి అనివార్యం. అదేవిధంగా వీరిద్దరికి మోదీ మద్దతు అనివార్యం.



పరస్పర అవసరాల వల్ల వీరి బంధం ఏర్పడింది. వీరికి ఒకరిపై ఒకరికి ఎంత అపనమ్మకం ఉన్నా అనివార్యంగా కలిసి ఉండాల్సిన పరిస్థితి. మోదీని వ్యతిరేకించి బాబు బయటకు వెళ్లి చేసేదేమీ లేదు. నితీష్ కుమార్ పరిస్థితి కూడా అంతే. మోదీతో సఖ్యతగా ఉండి తమ రాష్ట్రానికి కావలసినవి సాధించుకోవాలి తప్ప రాజకీయ ఎత్తుగడలతో సాధించేదేమీ ఉండదు. అలా భావించడం వల్లనే రెండు పార్టీలు మోదీ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించాయి. ఈ రెండు పార్టీల మద్దతుతో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వచ్చి ఉంటే రాజకీయాలు వేరుగా ఉండేవి. వీరిద్దరు మద్దతు ఇచ్చినా ఇండియా కూటమికి అధికారం దక్కదు. అందుకే అటు మోదీ ఇటు బాబు, నితీష్‌లు పరస్పర ప్రయోజాలను దృష్టిలో పెట్టుకొని కలిసిపోయారు. పరిస్థితులు వారిని కలిపాయి. ఈ బంధం వచ్చే ఎన్నికల వరకు ఉండే అవకాశాలే ఎక్కువ.

దేశంలోని ప్రధాన సర్వే సంస్థలు ఎన్డీయేకు 360 నుంచి 401 సీట్లు వస్తాయని ఎగ్జిట్‌పోల్స్‌లో చెప్పాయి. 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' అని మోదీ నినాదం ఇస్తే.. ఆ నినాదానికి తగ్గట్టు సర్వే సంస్థలు ఎగ్జిట్‌పోల్స్‌ను ప్రకటించాయి. కానీ, వాస్తవ ఫలితాలు అందుకు భిన్నంగా వచ్చాయి. దేశంలో మెజారిటీ మీడియా బీజేపీ కనుసన్నల్లో ఉన్నది. ఎన్డీటీవీ లాంటి వాటిని సైతం బీజేపీ అనుకూల వ్యక్తులు కొనేశారు. 400 సీట్లు అని చెప్పడం ద్వారా దేశవ్యాప్తంగా మీడియా తన విశ్వసనీయతను కోల్పోయింది. జూన్ 1న సాయంత్రం ఎగ్జిట్‌పోల్స్ వచ్చాయి. శని, ఆదివారం సెలవు. ఎగ్జిట్‌పోల్స్ ఫలితాల వల్ల సోమవారం స్టాక్‌మార్కెట్ రాకెట్‌లా దూసుకెళ్లింది. ఎగ్జిట్‌పోల్స్ వెనుక మీడియా యజమానుల స్వార్థం ఉందని తెలియని ఇన్వెస్టర్లు అవి నిజమేనని అనుకొని మార్కెట్‌ను ఆకాశానికెత్తేశారు. మరుసటిరోజు అసలు ఫలితాలు వచ్చాయి. ఎగ్జిట్‌పోల్స్‌కు, వాస్తవ ఫలితాలకు అసలు సంబంధమే లేకపోవడంతో 4న ఒక్క రోజే స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్ల రూ.30 లక్షల కోట్ల సంపద ఆవిరైపోయింది. ఎగ్జిట్‌పోల్స్ పేరుతో మార్కెట్‌ను ఇలా రాకెట్‌లా దూసుకువెళ్లేట్టు చేయడం వెనుక పెద్ద కుంభకోణం ఉందనేది రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణ. నిజానికి పోలింగ్ మొదలైనప్పటి నుంచి మార్కెట్ పడిపోతూ వచ్చింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మార్కెట్ నుంచి పెద్ద మొత్తంలో పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం మొదలుపెట్టారు. ఫలితాలు బీజేపీకి అంతగా సానుకూలంగా ఉండవనే సంకేతాలు అందడంతోనే పెట్టుబడులు ఉపసంహరించుకుంటున్నారనే వార్తలు మార్కెట్‌కు చేరాయి. కానీ, ఎగ్జిట్ పోల్స్ నిజమేనని భావించిన ఇన్వెస్టర్లు భారీగా దెబ్బతిన్నారు. ఈ కుంభకోణంపై జేపీసీ ఏర్పాటు చేసి విచారించాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. నిజంగా కుంభకోణం జరిగిందా? జరిగినా నిరూపిస్తారా? జేపీసీ వేస్తారా? అంటే ఇందులో ఏ ఒక్కటి జరగదనే సమాధానమే వినిపిస్తుంది. కానీ, దేశ చరిత్రలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా '4వ తేదీ నుంచి మార్కెట్ దూసుకెళ్తుంది, స్టాక్స్ కొనండి' అని దేశ ప్రధాని చెప్పడం విచిత్రం. ప్రధాని ఒక్కరే కాదు, హోం మంత్రి అమిత్ షా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఈ విధంగానే హామీ ఇవ్వడం స్వతంత్ర భారతదేశంలో మొదటిసారి. దేశం ఆర్థికంగా దూసుకువెళ్తుందని చెప్పడం, ఏయే రంగాల్లో అభివృద్ధి ఎలా సాగనున్నదో చెప్పడం ప్రధాని బాధ్యత. అయితే, స్టాక్‌మార్కెట్ సలహాలు ఇవ్వడమంటే ప్రధాని తన స్థాయిని తగ్గించుకోవడమే.

మ్యూచువల్ ఫండ్స్ అమ్మేటప్పుడు లాభం గ్యారంటీ అని బ్యాంకులు చెప్పడం ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధం. అర్హత పరీక్షలు పాసైనవారు మాత్రమే స్టాక్స్‌కు సంబంధించి యూట్యూబ్‌లో సలహాలు ఇవ్వాలని సెబీ నిబంధనలున్నాయి. కానీ, ప్రధాని మాత్రం ఏకంగా ఏయే స్టాక్స్ కొనాలో లోక్‌సభలోనే సగర్వంగా ప్రకటించారు. పీఎస్‌యూ స్టాక్స్ కొనమని, ఎల్ఐసీ స్టాక్ కొనమని మోదీ పార్లమెంటులో చెప్పారు. ఎల్ఐసీ 915 రూపాయలకు ఐపీవోకు వస్తే దాదాపు రెండేండ్ల పాటు 600-700 మధ్య తచ్చాడింది. వెయ్యి దాటగానే 'ఇప్పుడు చూడండి' అంటూ మోదీ ఆనందోత్సాహాలతో సగర్వంగా ప్రకటించారు. మోదీ ప్రకటించిన తర్వాత ఎల్ఐసీ మళ్లీ 900 రూపాయలకు దిగింది. ప్రధాని మాట నమ్మి కొన్నవారు నష్టపోయారు. 'హామీల అమలుకు నాదీ గ్యారంటీ' అని ప్రధాని చెప్తే గౌరవప్రదంగా ఉంటుంది. అంతేకాని స్టాక్‌మార్కెట్ సలహాలు ప్రధాని స్థాయికి తగవు. ఈ నేపథ్యంలో దేశ ప్రధాని హుందాగా ఉంటారని, ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తారని, దేశ పాలన అంటే వ్యాపారం కాదని, భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసేవారు దేశ ద్రోహులు కాదని ఇప్పటికైనా గ్రహిస్తారని ఆశిద్దాం.

**పొరుగు రాష్ట్రమైన ఏపీ మద్దతుతో మోదీ అధికారాన్ని నిలుపుకోవడం వల్ల తమ డిమాండ్లను సాధించుకునే అవకాశం ఆ రాష్ట్రానికి లభించింది. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్‌లకు చేరో 8 సీట్లు రావడంతో జాతీయస్థాయిలో మనకు వాయిస్ లేకుండాపోయింది. గత పదేండ్లు తెలంగాణకు ఏమీ సాధించని బీజేపీ ఇప్పుడేదో సాధిస్తుందని అనుకోవడం అత్యాశే. తెలంగాణ ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించినా మౌనంగా ఉన్న వీరు ఇప్పుడు ఏదో సాధిస్తారని ఆశించలేం. మోదీపై ఇండియా కూటమి ఉద్యమించగలదేమో కానీ తెలంగాణకు ఏదో సాధించి పెడుతుందని అనుకోలేం. తాజా సార్వత్రిక ఎన్నికలు ఏపీకి అదృష్టమైతే మనకు మాత్రం దురదృష్టం.**

**గతంలో ఒక సీఎంతో కరచాలనం చేయకుండా అవమానించడం, ఇప్పుడు ఒక సీఎం రాగానే లేచి నిలబడి కరచాలనం చేసిన తీరు రెండింటిలోనూ సహజ లక్షణం లేదు. బీజేపీకి సొంతంగా బలం ఉన్నప్పుడు అన్నీ నడిచిపోయాయి. ఇప్పుడు ఆ పార్టీ 240 సీట్లకే పరిమితమైంది. నితీష్, చంద్రబాబుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వల్ల గతంలో మాదిరిగా తన ఇష్టానుసారం వ్యవహరించడం సాధ్యం కాదు.**

లేఖ

## కల్తీకి అడ్డుకట్ట వేయలేమా?

**మనిషి** సంపాదన యావలో పడి ఆరోగ్యం మీద దృష్టిపెట్టడం లేదు. ఇంట్లో వంట చేసుకొని తినే సమయం లేక, హోటల్ తిండికి అలవాటు పడుతున్నాడు. ఇప్పుడు యాప్‌ల ద్వారా ఆహారం ఆర్డర్ చేయడం సర్వసాధారణమైపోయింది. ఘుమఘుమలాడే వాసన, ఆకర్షణీయమైన రంగులను చూసి జిహ్వా చాపల్యం కోసం మనిషి హోటళ్లకు క్యూ కడుతున్నాడు. డబ్బులు పెట్టి మరీ అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నాడు.

ప్రజల బలహీనతలను హోటల్ యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. లాభాపేక్షనే లక్ష్యంగా వినియోగదారుల ఆరోగ్యంతో ఆటలాడుతున్నాయి. ఎక్కువసార్లు కాచిన నూనె, గడువు ముగిసిన ఆహార మసాలాలు, పాడైపోయిన పదార్థాలను వాడుతూ వినియోగదారుల ఆరోగ్యాన్ని పీల్చి పిప్పిచేస్తున్నాయి. అంతేకాదు, వంట గదుల్లో అపరిశుభ్రత, కల్తీ పదార్థాల వాడ కం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతు న్నారు.

ఇటీవల రాష్ట్ర ఆహార భద్రత విభాగం అధికారులు చేసిన తనిఖీల్లో హోటళ్లలో జరుగుతున్న తతంగమంతా బట్టబయలైంది. గత 20 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా 67 చోట్ల తనిఖీలు నిర్వహించారు. అయితే హోటల్ యాజమాన్యాలు అనేక చోట్ల నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్టు తేలడం గమనార్హం. రోడ్డు పక్కన ఉండే చిన్న చిన్న ఫుడ్ సెంటర్ల నుంచి మొదలుకొని స్టార్ హోటళ్ల వరకు ఇదే పరిస్థితి ఉండటంతో ప్రజల్లో భయాందోళనలు కలుగుతున్నాయి. రుచి సంగతి పక్కన పెడితే.. శుచి, శుభ్రత, నాణ్యత మచ్చుకైనా కానరాకపోవడం శోచనీయం.

ప్రజల జీవనశైలి, ఆహారపుటలవాట్ల కారణంగా ఇప్పటికే అనేక వ్యాధులు సంక్రమిస్తున్నాయి. జంక్, ఫాస్ట్‌ఫుడ్స్‌కు అలవాటు పడటం, వ్యాయామం చేయకపోవడం, కల్తీల వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నారు. వీటి కారణంగానే సుమారు 56 శాతం వ్యాధులు సంక్రమిస్తున్నాయని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్ ) చెప్తున్నది. మంచి ఆరోగ్యం కోసం ఏం తినాలి? ఎప్పుడు తినాలి? వంటి అంశాలను ఎన్ఐఎన్ ఇటీవల ప్రకటించింది. పోషకాహారంతో బీపీ, షుగర్, హృద్రోగం తదితర ముప్పులను తగ్గించుకోవచ్చని తెలిపింది. ఉప్పు, చక్కెర ఎక్కువగా ఉండే అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ (చిప్స్, బర్గర్లు, పిజ్జా, కూల్‌డ్రింక్) విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

అయితే ప్రజలు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ కల్తీల బారినపడకుండా మాత్రం తప్పించుకోలేకపోతున్నారు. అటు ప్రభుత్వం పట్టించుకోకపోవడం, ఇటు అధికారులు సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తుండటంతో కల్తీ వ్యాపారానికి అడ్డు లేకుండా పోయింది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో హోటల్ యాజమాన్యాలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఇలాంటి హోటళ్లలో తింటూ ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. కాబట్టి హోటల్ శుచి, శుభ్రతలపై, నాణ్యతా ప్రమాణాలపై ప్రజల్లో అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అట్లాగే హోటళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించని వ్యాపారులపై కొరడా ఝుళిపించాలి.


- మేకిరి దామోదర్
95736 66650

## ఎలిజిబిలిటీ కాదు, ఎలిమినేషన్ పరీక్ష!

*నీట్ వల్ల వైద్య విద్యావ్యవస్థ తీవ్రంగా దెబ్బ తింటున్నది. నీట్ అనేది ఎలిజిబిలిటీ పరీక్ష కాదు, అది ఎలిమినేషన్ పరీక్ష. నీట్ రాకముందు తమిళనాడులో వైద్య విద్య ప్రవేశ విధానం చాలా బాగుండేది. ఎప్పుడైతే నీట్‌ను తీసుకొచ్చారో అప్పటి నుంచి తమిళనాడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నది.*



- **కనిమొళి,** డీఎంకే నేత






## తెలంగాణ

పదగతులు స్వరజతులు
పల్లవించిన నేల
తేనె తీయని వీణ
రాగాల తెలంగాణ
ద్విపద దరువుల మేళ
యక్ష జ్ఞానపు శాల
పోతన కవి యోగి
భాగవత స్కంధాల
జయ గీతికై మోగెరా
తెలంగాణ జమ్మి కొమ్మై ఊగెరా
సింగిడై పొంగిందిరా తెలంగాణ
తంగేడై పూసిందిరా

శాతవాహన వీర శౌర్యమే
తెలంగాణ
ఇక్ష్వాకుల దమ్ము తేజమే
తెలంగాణ
చాళుక్య ప్రాకార గోపుర
ధామాల
కాకతీయులె మేటి నాటి
నిర్మాణాల

ఎన్నెలా తిన్నెలా
ఎగిసేటి గోదారి
కొండకోనల మేన
కులికె కృష్ణవేణి
వన్నెలొలికే రాణి
మన కిన్నెరసాని
చిలక వాగుల రేల
ఇసుక పుప్పొడి పూల
శిలల కళాతోరణం
యాదాద్రి ఆలయం
వెలిసిన శివరేడు
వేములాడ జూడు
ధర్మపురి తిరుమణి
శేషప్ప కవి ముని
వాసిగా చదువంపే
బాసర తీర్థంబు

అంబ జోగులాంబ
ఆదిలో పీఠంబు
అల్లంపురం నరుల
తొలి నివాసంబది

సమ్మక్క సారలమ్మ
తెలంగాణ
రుద్రమ్మ రుధిర జన్మ

భద్రాద్రి రామక్షేత్రం తెలంగాణ
గోల్కొండ ప్రేమసౌదం

పాల్కురికి సోమన్న
బసవ పురాణంబు
దివి నుంచి దిగి వచ్చి
కొలువైన తేజంబు
రామప్ప మందిరం
అవనికె సుందరం
సుక్క సత్తెం మిద్దె
ఒగ్గు కత మన కప్పె
పద్యానికందము
అప్పకవి చందము

రంగనాథ
రామాయణ గానము
ప్రతి ముంగిలి
పరవశించిన వైనము
కావ్య జగతికి దారి
మల్లినాథసూరి
మధుర విజయము రాసే
గంగావతి దేవి

మారన్న తెనుగన్న
సోమనార్యుల గన్న
ఈ నేల సాహిత్య
వైభవాన మిన్న
బతుకమ్మ బోనాలురా
పండగా సాయన్న
గుండెసడిరా

పైడి జయరాజు కాంతారావు
ప్రభాకరుడి చిత్ర వెలుగు
కళకు మూల గోత్రము
మా భూమి నరసింగుడి
సత్రము
జై బోలో తెలంగాణ
అన్న నిమ్మల శంకరన్న

జాయప సేనాని
నృత్య రత్నావళి
నటరాజు నీదారి

పేరిణి రణభేరి
వాగ్గేయ కవి వాణి
రామదాసుని బాణి

ఎరక బోధల కుప్ప
వరకవి సిద్ధప్ప
సిందేసి తాళము
ఎల్లమ్మ మేళము
నూటొక్క రాగాల
పోటెత్తె కిన్నెర
భాగయ్య అల్లిక
పూదోట మల్లిక

కనుల ఎర్రని జీర
కాళోజీ కవి ధార
అవని సుర గోళంబు
దాశరథి పద్యంబు
రాక మాచర్ల
వెంకటదాసు
యాలలు
రాళ్లకె చివురొంపె
చిన్న దాసుని చూపు

ఇద్దాసు తత్వాలు
ఇలపైన సత్యాలు
వేపూరి కీర్తన
ప్రతి పల్లె నర్తన

తూటా వలె
సుద్దాల హనుమంతు కవి పాట
యుద్ధ నౌక
గద్దరన్న జన గీతిక

విశ్వంభర జ్ఞానపీఠి సినారె
వల్లంకి తాళమై
వొలికె నీ కవనాలు

అపర మేధావి మన పీవీరా
భూమి స్వప్నాల కవి తావిరా
వేల గొంతుకల ధ్వని గానము
మన వేణు మాధువుడి
శిష్య గణము

సాహితీ సంద్రము
సురవరం గ్రంథము
ఉద్యమానికి గురువు
జయశంకరు సారు
మారోజు వీరన్న
సర్వాయి పాపన్న
ఉప్పల మన్సూరు
భాగ్యరెడ్డి వర్మ
ఈ మట్టి సృష్టించిన
ఉత్తమోత్తమ పుత్రులు


బందగీ నెత్తుటి
సింధూరమీ నేల
బరిగీసి నిలిచెరా
భీమిరెడ్డి భళా

ఆరుట్ల రావి నారాయణుని
త్యాగాల
కొమరం భీముడి
సమరంపు గర్జన

కమలమ్మ, ఐలమ్మ,
మల్లు స్వరాజ్యాల
కదనాల మగువల
తెగువరా తెలంగాణ

మలిపోరు తొలిపొద్దు
మన చంద్రశేఖరుడు
కల నిజము చేసిన
మన కథానాయకుడు

ఎన్ని ఘనతలు ఇచ్చుట!
తెలంగాణ ఎన్నడొడవని
ముచ్చట!



గోరటి వెంకన్న